నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | నవంబర్ 17, 2024 | www.navatelangana.com

గ్రూప్-4 ఉద్యోగానికి ఇద్దరు ఎంపిక

నవతెలంగాణ-కెరమెరి

గ్రూప్-4 ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదలైన చేసిన గ్రూప్-4 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన సూర్యవంశీ ఆకాష్, సుర్దపూర్ గ్రామానికి చెందిన ఉప్పుల సాయికృష్ణ ఉద్యోగం సాధించారు. ఎస్సీ కేటగిరిలో ఆకాష్ 4వ ర్యాంకు సాధించగా, సాయికృష్ణ బీసీ కేటగిరీలో ఎంపికయ్యాడు. ఇద్దరు మండల కేంద్రంలో ఎస్సెస్సి



పూర్తి చేసి ఉన్నత విద్య హైదరాబాద్‌లో పూర్తి చేశారు. సాయికృష్ణ ఎస్సీ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా, ఆకాష్ కమర్షియల్ ఇన్‌కంటాక్స్‌లో ఉద్యోగం పొందారు. ఉద్యోగాలు సాధించిన వీరిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.



జిల్లా కేంద్రంలో చెస్ పోటీలు

ఆసిఫాబాద్ : తాటిపెల్లి గోపాలకృష్ణ 32 వార్షికోత్సవం సందర్భంగా అర్జున అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆహ్వాన చెస్ టోర్నమెంట్-2024 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి నాగమణి మాట్లాడుతూ చెస్ క్రీడ ప్రజ్ఞను పెంచుతుందన్నారు. 300 మంది పాల్గొన్న క్రీడలో మొదటి ఆరుగురికి నగదు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి ఐదు బహుమతులు పొందిన వారిలో దుర్గం విన్సెంట్, అమ్రాజ్ దేవాన్ష్, దుర్గం దివ్య, బోర్కొట్ శాన్విక్, మేకల శ్రీతన్, అద్విక్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో అర్జున చెస్ అకాడమీ చైర్మన్ కోట సుధాకర్, గోపాలకృష్ణ, కడతల రాకేష్, తిరుపతి, కిరణ్‌కుమార్, యాదగిరి, అర్చన, స్వరూప, సదాల కార్తీక్, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మహా ప్రచారంలో మనోళ్లు..!

- అక్కడికి తరలివెళ్లిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- సరిహద్దు గ్రామాల్లో ఆయా పార్టీల తరపున ప్రచారం
- పొరుగు రాష్ట్ర ఎన్నికలపై ఉమ్మడి జిల్లావాసుల్లో ఆసక్తి
- తాజాగా రాజురాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి

పొరుగు రాష్ట్రం మహారాష్ట్ర ఎన్నికల పర్వంపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసుల్లో ఆసక్తి నెలకొంది. పొరుగు రాష్ట్రంలో ఈ నెల 20న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ఇక్కడి రాజకీయాలను హీటెక్కిస్తున్నాయి. ముఖ్యంగా ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉండటం..అక్కడ బీజేపీ కూటమి అధికారంలో ఉండటంతో స్థానికంగానూ ఈ రెండు పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి జిల్లాకు మూడు వైపులా మహారాష్ట్ర ప్రాంతం ఉండటం.. ఆ ప్రాంతంలోని సరిహద్దు గ్రామాలతో ఇక్కడి పల్లెవాసులకు బంధుత్వాలు, సత్సంబంధాలు కలిగి ఉండటంతో సామాన్య జనంలోనూ అక్కడి ఎన్నికల పర్వంపై ఆసక్తి నెలకొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా శనివారం ఉమ్మడి జిల్లాకు పొరుగున ఉండే రాజురాకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో ఆ పార్టీకి చెందిన ఇక్కడి నాయకులు సైతం తరలివెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. జిల్లాకు చెందిన ఎంపీ, పలువురు ఎమ్మెల్యేలు పొరుగు రాష్ట్రంలో ప్రచారం నిర్వహిస్తున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మహారాష్ట్రలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ఉమ్మడి జిల్లాపై ప్రభావం చూపుతోంది. అక్కడి రాజకీయ పార్టీల తరపున ప్రచారానికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు వెళ్లడం ఆసక్తి రేపుతోంది. ఈ నెల 20న ఎన్నికలు జరుగుతుండటంతో ప్రచారం పర్వం మరింత వేడెక్కింది. దీంతో ఉమ్మడి జిల్లా సరిహద్దు గ్రామాల్లోనూ అక్కడి ఎన్నికల సరళిని తెలుసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా పొరుగు రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ కూటమి తరపున ప్రచారానికి ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ వార్ధాకు వెళ్లగా.. ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ నయెగావ్, బోకర్‌లో ప్రచారం నిర్వహించారు. సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు జిల్లాకు సరిహద్దున ఉండే గడ్చిరోలిలో ప్రచారం చేపట్టారు. ఇక బీజేపీ కూటమికి మద్దతుగా ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం ప్రచారం నిర్వహించడంతో ఇక్కడి ఆయన అభిమానుల్లో



ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రచారం

ఎన్నికల పర్వంపై ఆసక్తి నెలకొంది. మరోపక్క ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు సరిహద్దున ఉండే రాజురాలో కాంగ్రెస్ కూటమి తరపున నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనడంతో ఈ రెండు జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆ సభలో పాల్గొనేందుకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెల 18న నాందేడ్ జిల్లా బోకర్‌లోనూ నిర్వహించే బహిరంగ సభలో సీఎం పాల్గొనే అవకాశం ఉండటంతో ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నేతలు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బాసరలో మకాం వేసి ఇక్కడి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. సీఎం సభను సక్సెస్ చేసేలా ఆయన దృష్టిసారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది వరకే రాష్ట్ర కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మహారాష్ట్రలో ప్రచారం నిర్వహించారు. మరోపక్క ఇటీవల ఆదిలాబాద్‌కు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం మహారాష్ట్ర ఎన్నికలపై స్పందించారు. కాంగ్రెస్‌కు ఓటేయకూడదని అక్కడి ప్రజలకు చెప్పాలని కార్యకర్తలకు సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సరిహద్దు గ్రామాలతో సత్సంబంధాలు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పొరుగున ఉండే మహారాష్ట్ర ప్రాంతాలు ఆనుకొని ఉంటాయి. దీంతో రెండు రాష్ట్రాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో పాటు సామాన్య ప్రజలకు సైతం సత్సంబంధాలు ఉంటాయి. తరుచూ వివిధ పనుల నిమిత్తం అక్కడి వారు ఇక్కడికి రావడం..ఇక్కడి వారు అక్కడికి వెళ్లడం సాధారణంగా జరుగుతుంది. ముఖ్యంగా అనేక మందికి బంధుత్వాలు ఉన్నాయి.దీంతో వారికి నచ్చిన పార్టీ, అభ్యర్థులకు ఓటేయమని చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయా పార్టీల తరపున ప్రచారానికి రోజువారీగా రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని రోజుల నుంచే ఆయా పార్టీల అభ్యర్థుల తరపున గ్రామాల్లో ప్రచారం నిర్వహించేందుకు యువత అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో అక్కడి ఎన్నికల పర్వంపైనే చర్చలు సాగుతుండటం ఆసక్తికరంగా మారింది. మన రాష్ట్రంలో ఏడాది కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగానూ మహారాష్ట్రకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఇక్కడ ప్రచారం నిర్వహించారు. మరోపక్క మహారాష్ట్ర ప్రాంతానికి మద్యం, డబ్బులు తరలివెళ్లకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రంలోని మూడు జిల్లాల అధికారులతో మన జిల్లా అధికారులు సమన్వయం చేసుకుంటూ పటిష్ట బందోబస్తు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- టీజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర టీజేఏసీ చైర్మన్, ఉద్యోగ గజిటెడ్ అధికారుల ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల సంఘం ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్, మారం జగదీశ్వర్ అన్నారు. శనివారం జిల్లా పర్యటనకొచ్చిన ఆయనను అన్ని సంఘాల నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి సకాలంలో అన్ని సమస్యలకు పరిష్కారం కనుక్కుంటామన్నారు. వికారాబాద్ జిల్లా లగ్చర్ల గ్రామంలో కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా ఉంటూ ప్రజల సంక్షేమానికి కృషి చేసే అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మళ్లీ ఇటువంటి పరిస్థితులు రాకాకుండా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. 317 జీవో ప్రకారం నష్టపోయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు వచ్చే విధంగా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీ సాధనకు 206 సంఘాలు ఏకమై జేఏసీగా ఏర్పడి ఉద్యోగ, గజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంసి. లింగన్న, వి.ప్రభాకర్, టి.నరేంద్రబాబు, కె.రవికుమార్, సామన్న, జుట్టు గజేందర్, భూమన్న, అశోక్ కుమార్, పుప్పాల కృష్ణకుమార్, రవి కుమార్ పాల్గొన్నారు.

రోజువారీగా తేమశాతాన్ని నమోదు చేయాలి



నవతెలంగాణ-ముధోల్

వరి కొనుగోలు కేంద్రంలో రైతుల వరి ధాన్యానికి సంబంధించి రోజువారీగా తేమశాతాన్ని నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ అన్నారు. మండల కేంద్రంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు గన్ని బ్యాగులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు అందించారు. మండలంలోని ఆష్టా, రువ్వి, విటోలి, బ్రహ్మన్‌గాం గ్రామాల్లో వరి కోనుగోలు కేంద్రాలను తహశీల్దార్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ కిరణ్‌కుమార్, డిఎఓ అంజిప్రసాద్, ఎడిఎ వినయ్‌బాబు, పిఏసిఎస్ సిఓ సాయరెడ్డి, ఎసివో నాగేశ్వరరావు, ఆర్ఐ నారాయణరావుపటేల్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన సాకే ప్రణీత్, మిట్‌పెల్లి సంతోష్, డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం సాధించిన నల్ల ప్రశాంత్‌ను శనివారం మాజీ జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అదే గ్రామానికి చెందిన రాగం పోతన్న భార్యకు ప్రమాదంలో చేతు విరగడంతో ఆమెను, సర్జరి చేసుకున్న కంసలబాయిని, బ్రెయిన్ సర్జరి చేయించుకున్న గజ్జల శివక్కను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ సర్పంచులు సాకే ఆనంద్, పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, మాజీ కో ఆప్షన్ మెంబర్ బాబుఖాన్, మాజీ ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, విలాస్ యాదవ్, రావుల నారాయణ, పన్నాల భోజారెడ్డి, మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, దేవిదాస్, మంత్రి సంతోష్, సుదర్శన్, బాబురావు, గంగన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఎంపికకు పూర్తయిన డెమోలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయుల ఎంపిక కోసం శనివారం డిసివో బి.శ్వేత ఆధ్వర్యంలో అభ్యర్థులకు డెమో తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 45 మంది హాజరయ్యారని, వీరిలో అర్హత గల వారిని త్వరలోనే ఎంపిక చేస్తామని తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. శనివారం ఆయన కాగజ్‌నగర్ మండలం సీతానగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సౌకర్యం కోసం తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. తూకం, తేమ యంత్రాలను వినియోగించి నిబంధనల మేరకు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అన్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ప్రభుత్వం ఇస్తున్నందున సన్నరకం ధాన్యం అధికంగా వచ్చే అవకాశాలున్నాయని, కొనుగోలు సమయంలో ధాన్యాన్ని పూర్తి స్థాయిలో పరిశీలించాలని సూచించారు. తూకం పూర్తయ్యిన వెంటనే ధాన్యాన్ని టాగింగ్ చేయబడిన రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రబ్బాని, గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి మనోహర్ర అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల పరిశీలన

ఈ నెల 17, 18 తేదీలలో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను శనివారం కాగజ్‌నగర్‌లో కలెక్టర్ పరిశీలించారు. స్థానిక ఫాతిమా కాన్వెంట్‌లోని పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ రెండు పరీక్షా కేంద్రాలు ఉండగా, వీటిలోని గదులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్ష కోసం జిల్లాలో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, కాగజ్‌నగర్‌లో 9 కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. పరీక్ష గదులలో ఫర్నీచర్, ఫ్యాన్లు, వెలుతురు సరిగా ఉండేలా సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఉన్నారు.



కాగజ్‌నగర్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గ్రూప్-3 పరీక్షకు 250 మందితో బందోబస్తు : ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-3 పరీక్షల సందర్భంగా పట్టణంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. 250 మందితో పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో సిబ్బందికి విధులపై మార్గ నిర్దేశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ గ్రూప్-3 పరీక్షను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వెలుపల పోలీస్ యంత్రాంగం విధులను నిర్వర్తిస్తుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌లో సూచించబడిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకునేలా ఉండాలని, పరీక్షా కేంద్రంలో విధుల నిర్వర్తించే ప్రతి ఒక వ్యక్తి కచ్చితంగా గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని తెలిపారు. లేని వారిని లోనికి అనుమతించడం జరగదని తెలిపారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతంలో 163 బిఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమల్లో ఉన్నందున ప్రజలు ఎవరు గూమికూడి ఉండకూడదని తెలిపారు. పరీక్ష కేంద్రం 500 మీటర్ల దూరం వరకు ఎలాంటి జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. అత్యవసర సమయంలో అభ్యర్థులు డయల్ 100 ద్వారా పోలీసు యంత్రాంగం సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, గ్రూప్-3 నోడల్ అధికారి జగ్రామ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, సిఐలు, ఎస్సైలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

తుడుందెబ్బ మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 20న ఉట్నూర్‌లో నిర్వహించే తుడుందెబ్బ ఉమ్మడి జిల్లాల మహాసభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ కోట్నాక విజయకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కన్వీనర్ కోవా విజయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ హక్కులను, అస్తిత్వాన్ని, చట్టాలను కాపాడుకోవడానికి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటామని పేర్కొన్నారు. ఆదివాసీ సమస్యలపై గళం ఎత్తి ప్రశ్నించి పరిష్కారం చూపే విధంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి ముందుంటదని తెలిపారు. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు నిర్వహించే ఉమ్మడి జిల్లా మహాసభకు నాలుగు జిల్లాల నుండి ప్రతినిధులు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా కో కన్వీనర్స్ పెందోర్ మారుతీ, కోట్నక రామ్‌షావ్, చాహకటి భగవంత్‌రావ్, కనక ప్రకాష్, సిడాం రాజు, మడావి దౌలత్‌రావ్ పాల్గొన్నారు.

లింగి వృద్ధాశ్రమానికి రూ.20వేల చెక్కు అందజేత

నవతెలంగాణ-తలమడుగు

లింగి గ్రామ సాయి వృద్ధాశ్రమానికి విద్యుత్ శాఖ తరపున ఎస్ఈ చౌహన్ సిబ్బందితో కలిసి శనివారం ఆశ్రమానికి రూ.20వేల చెక్కును అందజేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు దెబ్బడి అశోక్‌కు చెక్ అందజేశారు. కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ హరికృష్ణ, డీఈ ఎంఆర్ టి.ప్రభాకర్, ఎస్ఓ శ్రీనివాస్, ఏవో దిగంబర్, ఏఈ సతీష్, ఏవో శ్రవణ్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | నవంబర్ 17, 2024 | www.navatelangana.com

రాష్ట్రస్థాయిలో గెలుపొందిన ఆర్ట్స్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్బిఐ 90వ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో విద్యార్థులు ప్రవళిక, నిఖిత, శ్రీజ విఘ్నేశ్వరి రాష్ట్ర స్థాయిలో గెలుపొందారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ డా.అతిక్ బేగం బృందం శనివారం కలెక్టర్



రాజర్షిషాను ఆయన కార్యాలయంలో కలిశారు. ముందుగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించారు. జిల్లా నుంచి రెండు జట్లు ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థులు కావడం చాలా సంతోషకరమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపి జోనల్ స్థాయిలో కూడా గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్, వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, స్వప్న ఉన్నారు.

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్‌లో ఉన్న వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని హ్యాండీ క్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటి మహమ్మద్ ఇమ్రాన్ కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును కలిశారు. పలు సమస్యలను కమిషనర్‌కు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం వికలాంగుల చట్టాల పోస్టర్‌ను కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్ పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరం



నవతెలంగాణ-కడెం

మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని దేవునిగూడెం, కొలంగూడెం, గ్రామాల్లో కడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ కే.శివకుమార్ అధ్యక్షతన శనివారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. టొబాకో వలన కలుగు నష్టలను గురించి ప్రజలకు డాక్టర్ శివకుమార్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పొగ త్రాగడం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటిలో గొంతులో క్యాన్సర్ గడ్డలు, ట్యూబర్క్యోసిస్ వస్తాయని తెలిపారు. తంబాకు గుట్కాలు తినడం వలన కలుగు నష్టాల గురించి వచ్చే క్యాన్సర్ వ్యాధుల గురించి వివరించారు. అలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న నలుగురిని గుర్తించి, రక్త నమూనలను సేకరించి, చికిత్స అందించి మందులు అందజేశారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న అనారోగ్యస్తులను 52 మందిని చూసి, చికిత్స అందించారు. రక్తహీనతతో ఉన్నవారికి ఐరన్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడెం వైద్యాధికారి ఆరోగ్య విస్తరణ అధికారి టి.వేణుగోపాల్, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, ఎంఎల్‌హెచ్‌పీ బ్లెస్సి, రత్న, ఏఎన్ఎం శశికళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అండర్-17 బాలబాలికల బేస్ బాల్ పోటీలు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మైదానంలో 68వ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం అండర్-17 బాలబాలికల బేస్ బాల్ పోటీలను మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈనెల 16 నుంచి 18 వరకు కొనసాగుతాయని, ఇందులో 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడల్లో ప్రధానంగా వ్యక్తిగత ప్రతిభ కనబరుస్తూ, టీం మొత్తం సమిష్టిగా రాణించినప్పుడే విజయం సాధిస్తామని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, రాష్ట్ర, జాతీయ, స్థాయిల్లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ అందచేస్తారని, పైచదువులకు ఉత్తమ కళాశాలలో చదువుటకు, భవిష్యత్తులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ సమయంలో స్పోర్ట్స్ కోటాలో సర్టిఫికెట్ ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు అంజు కుమార్‌రెడ్డి, సమత ఫౌండేషన్ చైర్మెన్ సమతసుదర్శన్, పేట సంఘం అధ్యక్షులు భూక్య రమేష్, పేట సంఘం సెక్రటరీ కె.బోజన్న, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ అన్నపూర్ణ, ఏసీజీ పద్మ, భరత్, పలువురు వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలోకి అనుమతివ్వాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడాకారులు క్రీడలు ఆడేందుకు అనుమతులు ఇవ్వాలని నిర్మల్ పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు శనివారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు మాట్లాడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని చారిత్రాత్మక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్‌తో పాటు ఇతర క్రీడలు ఆడేందుకు అధికారులు తగిన రుసుము చెల్లించి అనుమతులు తీసుకోవాలని చెప్పడం శోచనీయమన్నారు. నూతనంగా నియమించబడ్డ జిల్లా క్రీడా, యువజనుల సంక్షేమ శాఖ అధికారి లేనిపోని నియమనిబంధనలు సృష్టిస్తూ క్రీడాకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇదే క్రీడా మైదానంలో పట్టణానికి చెందిన క్రీడాకారులు ప్రాక్టీస్ చేసి రాష్ట్ర, జాతీయస్థాయిలలో రాణించి తమదైన రీతిలో క్రీడాలలో నైపుణ్యాతను సాధించారన్నారు. ప్రభుత్వపరంగా ఎలాంటి ఉత్తర్వులు, ఆదేశాలు లేకపోయినా నిర్మల్ జిల్లా క్రీడా, యువజనుల సంక్షేమ శాఖ అధికారి ఇష్ట రాజ్యంగా లేనిపోని నియమ నిబంధనలు, ఆంక్షలు అమలు చేస్తూ, తమను తీవ్ర మానసిక శోభకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని లేనిచో క్రీడాకారులందరూ ఏకమై ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రఫీ అహ్మద్ ఖురేషి, ఎన్‌సీసీ జట్టు బాధ్యులు సయ్యద్ ఉమర్ కాషీఫ్, తన్వీర్ టైగర్ జట్టు బాధ్యుడు మహమ్మద్ తన్వీర్ ఖాన్, ఏజెడ్ జట్టు కెప్టెన్ అయ్యాస్ మెమన్, వారియర్ జట్టు కెప్టెన్ వినయ్, సందీప్, మహమ్మద్ అథర్‌ఖాన్, సయ్యద్ అక్బర్, షహబాస్, మొహమ్మద్ అన్వర్‌ఖాన్, మహమ్మద్ నవీద్, శంకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

సీఎం సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బేల

మహారాష్ట్రలోని రాజురలో శనివారం నిర్వహించిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సభకు ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డితో పాటు బేల మండల నాయకులు హాజరయ్యారు. రాజుర కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్ ధోటేను అధిక మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలను కోరారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసినట్లే మహారాష్ట్రలోను కాంగ్రెస్ గెలిస్తే ఐదు గ్యారంటీలను అమలు అవుతాయని వివరించారు. ఈ సభకు హాజరైన వారిలో బేల మండలాధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, జైనథ్ మార్కెట్ వైస్ చైర్మెన్ విలాస్ పటేల్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘన శ్యామ్, బేల మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవినాష్, మార్కెట్ డైరెక్టర్ మడవి చంద్రకాంత్, భోక్రే శంకర్, విజయ్, కరీం, విలాస్ రాథోడ్, భాస్కర్ హాజరయ్యారు.

మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై ఉద్యమం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య
- కుటుంబ సమగ్ర సర్వేలో వ్యక్తిగత వివరాలు సేకరించొద్దు



నవతెలంగాణ-నిర్మల్

మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమాలు చేస్తామని, కుటుంబ సమగ్ర సర్వేలో వ్యక్తిగత వివరాలు సేకరించవద్దని సీపీఐ(ఎం) రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎం.అడివయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవనంలో సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలను అమలు చేయడానికి ప్రయత్నంచేస్తుందని అన్నారు. కొత్తగా చేసిన మూడు క్రిమినల్ చట్టాలు అప్రజాస్వామిక, నియంతృత్వ చట్టాలని, భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 152 ప్రకారం దేశ పౌరులపై దేశ ద్రోహం ముద్ర వేయడానికి అవకాశం ఉందని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి, ప్రతిపక్ష రాజకీయ నాయకులపై వేధింపులకు దిగుతుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మైనారిటీ వ్యతిరేక చట్టాలను అమలులోకి తీసుకువస్తుందని, మైనారిటీలపై దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఎరువులపై సబ్సిడీ రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీ రూ.7,082 కోట్లు కోత విధించిందని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధుల కోతను విధించి పథకాన్ని రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో వ్యక్తిగత వివరాలు సేకరించకూడదని అన్నారు. సర్వే పట్ల ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.నూతన్ కుమార్, బి.వసుధ, జిల్లా కమిటీ సభ్యులు డి.పోశెట్టి, ఎండి ఫాసియొద్దీన్, టి.శంభు, గంగాదేవి, కామాక్షి, సాధన, ప్రసన్న, నర్సయ్య పాల్గొన్నారు.

కుటుంబ దత్తత వైద్యశిబిరం

నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి గ్రామంలో రిమ్స్ వైద్యకళాశాల ఆధ్వర్యంలో ఫ్యామిలీ అడాప్షన్ ఉచిత హెల్త్ ప్రోగ్రామ్‌ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని అన్ని కుటుంబాలను అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా పొందవచ్చని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నారి గ్రామాన్ని హెల్త్ ప్రోగ్రాంలో దత్తత తీసుకొని రిమ్స్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న మెడికో విద్యార్థులచే ఈ గ్రామానికి చెందిన ఒక్కో విద్యార్థికి నాలుగు కుటుంబాల చొప్పున కేటాయించి, ఆ కుటుంబాలకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు రిమ్స్ డాక్టర్లచే వైద్యం అందించడం జరుగుతుందని అన్నారు. ప్రతి నెలలో మూడో శనివారం ఈ గ్రామానికి వచ్చి ఆ విద్యార్థులకు కేటాయించిన కుటుంబాలకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి రిమ్స్‌లో మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాల వరకు ఈ గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రకాల వైద్యం అందించడం



జరుగుతుందన్నారు. మెడికో విద్యార్థులకు కేటాయించిన కుటుంబాలకు సంబంధించిన వైద్యానికి సంబంధించిన అన్ని వివరాలు విద్యార్థులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ విల్సన్, తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రావ్యవాణి, అంగన్‌వాడీ గడుగు దేవమ్మ, మాజీ సర్పంచ్ మాజీ సర్పంచ్ అశోక్, మాజీ వైస్ ఎంపీటీసీ రేఖ రఘు, గ్రామస్తులు రమణ, లక్ష్మీపతి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం మహిళ స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసి, మహిళల ప్రగతికి బాటలు వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. పాఠశాలలను అన్ని రకాల అభివృద్ధి పరిచేందుకు అమ్మఆదర్శ పాఠశాల పథకం ద్వారా మహిళ స్వయం సహాయక సంఘాలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. త్వరలో రాష్ట్రంలో సోలార్ వాటర్ ప్లాంట్ల పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించనున్నట్టు తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదింటి కుటుంబాలకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థికంగా ఎంతో భరోసాను కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సకాలంలో బ్యాంకులో జమ చేసి, ఆ డబ్బులను అభివృద్ధి పనులకు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్, అధికారులు, మహిళలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-ముథోల్

ప్రసిద్ధపుణ్యక్షేత్రం శ్రీజ్ఞాన సరస్వతిదేవీ అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రిని అధికారులు. అర్చకులు మంగళ వాయిద్యాలు, పూర్ణ కుంభంతో అర్చకులు, ఈఓ విజయరామారావు స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ఆయన కుంకుమార్చన పూజలు చేశారు. ఆశీర్వచన మండపంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అమ్మవారి చరిత్ర ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకులు వివరించారు. ఆశీర్వచన మండపంలో ఆయనకు ప్రధాన అర్చకులు సంజీవ్‌పూజారి, స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, శాలువాతో సత్కరించి, అమ్మవారి ఫోటోను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ తీగల వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్లు రమేష్, లక్ష్మణ్‌రావ్ పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన



నవతెలంగాణ-ఉట్నూర్

కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో ఉట్నూర్‌లోని జీఆర్ నగర్‌లో శనివారం పత్తి, కంది పంటలను శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రాజశేఖర్, డాక్టర్ డి.మోహన్‌దాస్, డాక్టర్ ఎం.సునీల్ కుమార్, డాక్టర్ శివచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కంది, శనగ పంటలకు పురుగు మరుగా మచ్చల పురుగులు ఆశించే అవకాశం ఉందని వాటిని నివారణకు ఫ్లుబైండమైండ్, ఇషో క్లోజోరం లాంటి మందులను పిచికారి చేసుకోవాలని తెలిపారు. అనంతరం పండ్ల తోటలపై ఆశించే పురుగులకు వాటికి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

19న కొలామీ వికీపీడియా శిక్షణ శిబిరం



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలో బోలి చేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికీపీడియా స్వేచ్ఛ విజ్ఞాన సర్వస్వము కొలామీ వికీపీడియా శిక్షణ శిబిరాన్ని ఈ నెల 19న నిర్వహిస్తున్నామని బోలి చేతో ఫౌండేషన్ బోర్డు సభ్యులు ఆత్రం మోతిరామ్, సిడాం వరప్రసాద్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండల కేంద్రంలోని గిరిజన భవనంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ శిబిరంలో తెలంగాణ గ్రామీణ వ్యాసాలకు సంబంధించిన సమాచారాన్ని కొలామీ వికీపీడియాలో చేర్చడం జరుతుందన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని, శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొలాం సేవా సంఘం నాయకులు ఆత్రం దేవ్‌రావ్ పాల్గొన్నారు.

నేడే గ్రూప్-3 పరీక్ష... సర్వం సిద్ధం..

- 29 పరీక్ష కేంద్రాలు, 10,255 మంది విద్యార్థులు
- రెండు రోజుల పాటు జరగనున్న పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ శాఖల్లోని పలు ఉద్యోగాల భర్తీకి నిర్వహించే గ్రూప్-3 పరీక్షలు ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. పరీక్షలో సాధించిన మార్కులు ఆధారంగా ఉద్యోగం లభించనుంది. ఈ పోస్టులకు ఎటువంటి ఇంటర్వ్యూలు ఉండవు. కాగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 10,255 మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాసేందుకు మొత్తం 29 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రూప్-3 పరీక్ష రెండు రోజులపాటు, మొత్తం మూడు పేపర్లు మూడు సెషన్స్‌లో జరగనుంది. ఇందుకోసం రూట్ ఆఫీసర్ ఐదుగురు, 29 మంది శాఖల అధికారులను, ఫ్లయింగ్ స్క్వాడ్స్ పదిమంది, రూట్ ఆఫీసర్, జాయింట్ రూట్ ఆఫీసర్‌లు పది మందిని నియమించారు. కాగా శనివారం పట్టణంలోని ఆయా కేంద్రాలలో స్టిక్కరింగ్ వేసి ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని సైన్స్ డిగ్రీ కళాశాల కేంద్రంలో ఈ ఏర్పాట్లను గ్రూప్-3 చీఫ్ సూపరింటెండెంట్ డా.అరుణ్ పర్యవేక్షించారు.

రెండు రోజులు, మూడు సెషన్‌ల పరీక్ష...

ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్-1, జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 గంటల వరకు పేపర్-2 హిస్టరీ, పొలిటి అండ్ సొసైటీ పరీక్ష మరుసటి రోజు సోమవారం ఉదయం 10. 00 గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం పరీక్షకు 9.30 గంటలకు గేటు మూసివేస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 2.30 గంటలకు గేట్లు మూసివేస్తారు.

గుర్తింపు కార్డు వెంట తీసుకెళ్లాలి...

హాల్ టికెట్లు అధికారికి టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే, దానిపై ఫొటో అంటించి గెజిటెడ్ ఆఫీసర్ సంతకం ధృవీకరించాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రంలో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. మూడు పాస్ పోర్ట్ ఫోటోలను పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లాలి. బ్లూ లేదా బ్లాక్ పెన్‌తో పాటు హాల్ టికెట్, ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకువెళ్లాలి. మొదటి పరీక్షకు తీసుకెళ్లిన హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకూ తీసుకెళ్లాలి. పరీక్షల అనంతరం హాల్‌టికెట్ కాపీని, ప్రశ్నాపత్రాలను భద్రంగా పెట్టుకోవాలి.

ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు...

సెల్ ఫోన్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్‌తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి. తమ వెంట ఎలాంటి వస్తువులు తీసుకురావడానికి వీలులేదు. అలాగే పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, ఫర్నిచర్, సానిటేషన్, తదితర సౌకర్యాలు కల్పించారు. ఫ్యాన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని నియమించారు.

ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు...

గ్రూప్-3 పరీక్ష నేపథ్యంలో ఆదిలాబాద్ నుంచి బంగారిగూడ, ఆదిలాబాద్ నుంచి జైనథ్ మండలం పిప్పర్‌వాడకు ఉదయం ఎనిమిది గంటలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కల్పన పేర్కొన్నారు. పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులకు ఆదిలాబాద్ బస్ స్టాండ్‌లో మై ఐ హెల్ప్ సెంటర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు సెల్ 7382840061 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ అమలు...



గ్రూప్-3 రాత పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు ఉంటుందని, ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్ష సమయంలో జీరాక్స్ సెంటర్‌లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ విషయాన్ని గమనించి జిరాక్స్ సెంటర్ యజమానులు సహకరించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని ఇందాని గ్రామంలో శుక్రవారం షార్ట్ సర్క్యూర్‌తో అగ్ని ప్రమాదం జరిగి చాప్లే ప్రకాష్ ఇల్లు పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఆర్ఐ శైలజ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయాన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన నష్ట పరిహారం అందించేలాగా చూస్తామని తెలిపారు. కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ఆర్ ప్రశాంత్ తమ వంతు సహకారం అందిస్తామని బాధిత కుటుంబానికి బరోసా ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శ

నవతెలంగాణ-బెజ్జూరు



మండల కేంద్రానికి చెందిన ముగ్గురు యువకులు ఇటీవల ప్రాణహిత నదిలో మునిగి మృతి చెందడంతో శనివారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వారి కుటుంబాలను పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన మోయిజ్, ఇర్షాద్, జహీర్ అలీ అనే యువకులు మృతి చెందగా వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట నాయకులు వెంకన్న, బషారత్ ఖాన్, అమీరుద్దీన్, సకారం, నరేందర్ గౌడ్, జాహిద్ హుస్సేన్, శ్రీనివాస్, వెంకన్న ఇస్తారి, రవి ఉన్నారు.

19న వేలాలలో గట్టుమల్లన్న గుట్ట ప్రదక్షిణ



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణాలో ప్రసిద్ధి చెందిన వేలాల పర్వత ప్రాంతంలో స్వయంభూ:గా వెలిసిన గట్టుమల్లన్న గుట్ట చుట్టు(గిరి) ప్రదక్షిణకు భక్తులు సన్నద్ధమవుతున్నారు. చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మరాం మహారాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న మొట్ట మొదటి సారిగా గట్టుమల్లన్న గుట్ట ప్రదక్షిణ ప్రారంభం కాబోతుంది. కొండగట్టు ఆంజనేయస్వామి గుట్ట ప్రదక్షిణ మొదలై 22 నెలలు కావస్తుండగా అదే తీరున వేలాల గట్టు మల్లన్న గుట్ట ప్రదక్షిణ కూడ ప్రతి నెల కొనసాగించాలని భక్తులు భావిస్తున్నారు. ప్రతి నెల ఆరుద్ర నక్షత్రం రోజున వేలాలలో గిరి ప్రదక్షిణకు వేలాల గట్టు మల్లన్న గిరి ప్రదక్షిణ సభ్యులు సంకల్పించినట్లు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో ఎనగందుల శేఖర్ తండ్రి లస్మ లక్ష్మియ్య, అగర్‌గూడ గ్రామానికి చెందిన ఆలం సకారాం కోడలు అనూషనెల్లూరు గ్రామానికి చెందిన దయాకర్ గౌడ్ తల్లి బాయమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు చౌదరి తిరుపతి, సాజిత్, మాజీ సర్పంచ్ సంజీవ్, శ్రీనివాస్, రాజన్న చౌదరి బండన్న ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-పెంచికల్ పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన తెనికే తిరుపతి తల్లి మరణించడంతో కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు రాచకొండ కృష్ణ రూ.మూడు వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు దాసరి చంద్రమౌళి, శంకర్ గౌడ్ ఉన్నారు.

నూతన ఏఓకు సన్మానం

నవతెలంగాణ-బెజ్జూరు

మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో పెంచికల్‌పేట్ నూతన ఏఓగా నియమితులైన మనిషాకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు రాచకొండ చంద్రశేఖర్, భోగ రమేష్, సభ్యులు తంగడపల్లి మహేష్, పుల్లూరి సంతోష్, పుల్లూరి సతీష్, భోగ అనిల్, శంకరయ్య, మిరియాల పెంటయ్య, రేణిగుంట్ల అనిల్, చిలువేరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మూడవ రోజు కొనసాగాయి. మూడోరోజు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాలను మంచి స్నేహితులుగా ఎంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ ప్రసాద్, చంద్రశేఖర్, ఉదయ్ కిరణ్, నాయకుడు అమర్ బిన్ హైమద్, లైబ్రేరియన్స్ సదానందం, ప్రవీణ, స్వర్ణలత, సతీదేవి, వెంకటరమణ, స్వీపర్ సలీం, రామయ్య గోపి పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో చోటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కమిటీలో కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటేష్‌కు చోటు దక్కింది. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా దాసరి వెంకటేష్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ్‌కుమార్ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో సంఘం పటిష్టానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

ఉద్యోగం సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రానికి చెందిన మాచర్ల లక్ష్మీ నాగయ్య దంపతుల రెండో కుమారుడు బాలాజీ గత నెల క్రితం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీగా ఎంపికయ్యాడు. యువకుడు శిక్షణ పొందిన విజయవాడలోని వరుణ్ ఫిజికల్ ఇనిస్టిట్యూట్ నుంచి పిలుపు రావడంతో తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు. వరుణ్ శిక్షణ కేంద్రం వారు మాచర్ల బాలాజీని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ కేంద్రం డైరెక్టర్ వరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రత్యేక అధికారికి సూచించారు. పాఠశాలలో వంట షెడ్డును, కూరగాయలను పరిశీలించిన వారు కూరగాయలు చెడిపోయాయని మంచి కూరగాయలతో భోజనం విద్యార్థులకు అందించాలని వారికి సూచించారు. పాఠశాలలో గైర్హాజరు ఎక్కువగా ఉందని, విద్యార్థులు గైర్హాజరు ఎందుకు అయ్యారో ఎస్ఓను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని వారికి సూచించారు. పాఠశాలలో గణితశాస్త్రం బోధించే ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎలుకపెల్లి గ్రామంలో నిర్వహించిన కుటుంబ సర్వేను పరిశీలించారు. అంతకుముందు చెడువాయి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకోవాలని తేమ, తాలు శాతం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీసీఏఓ మహమ్మద్ అలీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏపీఓ మనోహర్, ఏఓ మనీషా, డీఆర్ డీప ఏపీడీ రామకృష్ణ, పీఏసీఎస్ సెక్రటరీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో గ్రూప్-3 అభ్యర్థుల ప్రవేశ పరీక్ష కోసం ఏర్పాటు చేసిన పలు సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు రోజులపాటు నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ 163 (సెక్షన్ 144) అమలులో ఉంటుందన్నారు. పరీక్షల వద్ద ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు పోలీస్ సిబ్బందితో పరీక్ష నిర్వహణపై ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే అధికారులందరూ నిర్ణీత సమయాని కంటే ముందే పరీక్ష కేంద్రాల వద్ద ఉండాలని, పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తించే ప్రతి ఒక్క వ్యక్తి కచ్చితంగా గుర్తింపు పొందిన అధికారి నుండి ఐడి కార్డ్ కలిగి ఉండాలని లేనియెడల వారిని ఎట్టి పరిస్థితిలో పరీక్ష కేంద్రం లోనికి అనుమతించకూడదన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా పరీక్షలు జరిగేలా చూడాలని బయోమెట్రిక్, అభ్యర్థి ఐడెంటిఫికేషన్‌లో ఏదైనా సమస్య వస్తే వెంటనే సంబంధితపై అధికారులకు తెలియజేయాలన్నారు. ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కూడా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించకూడదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ప్రభాకర్ రావు, డీఎస్పీ కరుణాకర్, స్థానిక సీఐ రవీందర్ పాల్గొన్నారు.

సంవిధాన్ దివస్ పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్



లుంబిని దీక్ష భూమిలో ఈ నెల 24న నిర్వహించే సంవిధాన్ దివస్ పోస్టర్లను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం సమతా భారత్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రాధాన్యత ఎంతో గొప్పదన్నారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాలకు దీని అవసరం ఎంతో ఉందన్నారు. అటువంటి గొప్ప గ్రంథాన్ని గౌరవించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం ఈ నెల 24న లుంబిని దీక్ష భూమిలో భారత రాజ్యాంగ దివస్ (సంవిధాన్ దివస్) నిర్వహించడం జరుగుతుందని దీనికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, సీనియర్ వైద్యుడు ఎంఎఫ్. గోపీనాథ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 15 మండలాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. హైదరాబాద్‌కు చెందిన సమత భారతి సంస్థ ప్రతినిధులు సెరికల్చర్ రిటైర్డ్ అధికారి అన్నరావు జాడే, బేగంపేట్ ఏరోడ్రాం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆనందరావు జాడే, డాక్టర్ టేమాజీ డోంగ్రే, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ సభ జిల్లా అధ్యక్షులు మహాప్రబ్ అశోక్ మహుల్కర్, ఉపాధ్యక్షులు వినేష్ ఉప్రే పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పారా మెడికల్ కోర్సులలో అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో పారా మెడికల్ కోర్సులైన డీఎంఎల్‌టీలో 30 సీట్లు, డీఎంఎసీజీలో 30 సీట్లు ఉన్నాయని, ఇంటర్మీడియట్‌లో బీపీసీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఎంపీసీ గ్రూపుల వారికి అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 25న ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, డిసెంబర్ 2వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. అభ్యర్థులు 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ధ్రువపత్రాలు, బోనఫైడ్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫోటో దరఖాస్తు ఫారంతో దరఖాస్తు చేసుకోవాలని, రూ.100 రుసుము చెల్లించాలని తెలిపారు. దరఖాస్తు ఫారంను ఆన్ లైన్‌లో టీ జీ వీ ఎం బీ. తె లం గా ణ. జీ ఓ వీ. ఇ న్ లో పొందవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- గుర్తింపు సంఘం బాధ్యతగా వ్యవహరించాలి



నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన స్ట్రక్చర్ సమావేశంలో సింగరేణి విశ్రాంత కార్మికులు, ఉద్యోగుల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ కార్మికుల ప్రధాన సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బాధ్యతగా యాజమాన్యం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. వైద్య సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన విధంగా రూ.8 లక్షలుగా ఉన్న కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం (సీపీఆర్ఎంఎస్) వైద్య సౌకర్యం రూ.10 లక్షలకు పెంచుతూ ఇచ్చిన ఆదేశాలు వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకత్వం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా పెన్షన్ పెంపుదల కోసం ఈ సమావేశం ద్వార విజ్ఞప్తి చేస్తూ బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపించాలని కోరారు. కాగా సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న వేడుకలు ఘనంగా నిర్వహించాలని తీర్మాణం చేశారు. ఈ సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాద్, కోశాధికారి విజయ బాబు, ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య, బీరయ్య, ప్రార్థసారధి, వెంకట రాజిరెడ్డి, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

నిఘా నీడన బాసర ట్రిపుల్ ఐటీ

- ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బందోబస్తు
- ఎక్కడికక్కడే విద్యార్థుల అరెస్టులు

నవతెలంగాణ-ముధోల్

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య జరిగిన రోజు నిరసన తెలిపిన ఏబీవీపీ కార్యకర్తలపై దాడికి నిరసనగా శనివారం ఏబీవీపీ ట్రిపుల్ ఐటీ ముట్టడికి పిలుపునిచ్చింది. ట్రిపుల్ ఐటీ పరిసర ప్రాంతాల్లో, బాసరలో వచ్చే ఆయా ప్రధాన కూడళ్ల వద్ద గట్టి భద్రతను పోలీసులు ఏర్పాటు చేశారు. ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులు మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి ఏబీవీపీ కార్యకర్తలు వందల సంఖ్యలో బాసరకు చేరుకుంటున్నారన్న సమాచారం పోలీసులకు రావటంతో ఎక్కడికక్కడే విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. జిల్లా ఎస్పీ ట్రిపుల్ ఐటీ దరిదాపుల్లోకి విద్యార్థి సంఘాల నాయకులు రాకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేయించారు. బందోబస్తును ఎస్పీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నిర్మల్ జిల్లాలతో పాటు పోలీసులు పక్క జిల్లా నిజామాబాద్ నుంచి పోలీసులు భారీ సంఖ్యలో బాసరకు చేరుకొని బందోబస్తు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి బాసరలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.

ప్రజపాలన కళాయాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో ప్రజాపాలన యేడాది పూర్తి అయిన సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని జిల్లాలో ప్రజపాలన కళాయాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ఈనెల 19 నుంచి తేది డిసెంబర్ 7 వరకు ప్రజాపాలన కళాయాత్ర చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. దీనికి సంబంధించి సన్నాహక ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపైన కళాయాత్ర బృందం ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, అంతడుపుల నాగరాజు, రాష్ట్రమంతా పర్యటిస్తారని పేర్కొన్నారు. వీరు మన జిల్లాలో ఈనెల 22న ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులచే జిల్లాలోని మండలాలు, మేజర్ గ్రామపంచాయతీలలో రెండు టీములుగా ఈనెల19 నుంచి డిసెంబర్ 7 వరకు గ్రామాల్లో తిరుగుతూ ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో సీఈఓ జితేందర్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ సాయన్న, టూరిజం ఆఫీసర్ రవీందర్, డీపీఆర్ఓ తిరుమల, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీపీఓ శ్రీలత, పీడీ మెప్మా మమత, కలెక్టరేట్ ఏఓ రామిరెడ్డి ఉన్నారు.

పంట కోత ప్రయోగాలు



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని గుడ్లబోరిగామ శివారులో గల వరి పంటలో పంట కోత ప్రయోగాన్ని మండల వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న నిర్వహించారు. 5 ఐ 5 మీటర్ల పరిధిలో గల పంటను కోసి తూకం వేసి వచ్చిన ధాన్యం దిగుబడి(14.145 కిలోలు) ద్వారా ఎకరానికి ఎంత దిగుబడి వస్తుంది అని అంచనా వేశారని తెలిపారు. ఈ ప్రయోగం వలన ఎకరానికి దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారిని తెలిపారు. అలాగే ఈ ప్రయోగాల ద్వారా పంట నష్టం జరిగినప్పుడు దిగుబడి అంచనా ప్రకారం నష్ట పరిహారం అందించేందుకు ఉపయోగ పడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని పెందోర్. ప్రేమ లత పాల్గొన్నారు.

బెజ్జూరులో మూడు నాలుకల వింత దూడ జననం

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలో శనివారం మేకల పర్వతాలుకు చెందిన గేదె ప్రసవించింది. గేదెకు మూడు నాలుకల వింత దూడ జన్మించడంతో మండల వాసులు వింతగా దూడను చూస్తున్నారు. ఈ విషయమై పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ సంప్రదించగా జన్యుపరమైన లోపంతో వింత దూడ జన్మించినట్లు తెలిపారు. రైతులు పశువులు ఎదకు చిన్నప్పుడు మందలలో వదలకుండా, పశు వైద్యశాలకు తరలించాలని సూచించారు. పశువులు మందల్లో ఇతరత్రా మగ పశువులతోని కలవడం వల్ల ఇలాంటి జన్యు లోపాలు వస్తున్నాయి తెలిపారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో పశువులకు వీర్యం అందుబాటులో ఉందని తెలిపారు, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పేదింటి యువతి వివాహానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామానికి చెందిన పేదింటి యువతి మేకల శ్రీవాణి వివాహానికి నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత శనివారం రూ.5016 అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదింటి ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సాయం అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి పేదలకు సహకారం అందించాలని కోరారు.

ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం అందజేత

జన్నారం ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యంను ఆ అందించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చేలువేరు నరసయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న, గౌరవ సలహాదారులు పూదరి సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి జాడి వెంకట్, కోశాధికారి శేఖర్, పవన్ సత్యం, శక్తి యూత్ అధ్యక్షులు మద్రిపల్లి శేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

రేపు బెల్లంపల్లి క్యాంప్ ఆఫీసులో ప్రజాదర్బార్

నవతెలంగాణ-తాండూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. ప్రజల వ్యక్తిగత సామాజిక అంశాలలోని సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల సహకారంతో ప్రజాదర్బార్ ఏర్పాటు చేయనున్నమన్నారు. నియోజకవర్గంలోని మండలాలకు చెందిన ప్రజలు వినియోగించుకొని సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారు. ప్రజాదర్బాల్లోని సమస్యల పరిష్కారానికి నియోజకవర్గంలోని అధికారులంతా అందుబాటులో ఉంటారని ఆయన కంటి వైద్య శిబిరం కార్యక్రమంలో తెలిపారు.

అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ పడేయ్యొద్దు

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్‌లోని అటవీ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయకూడదని జన్నారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ సుష్మారావు సూచించారు. శనివారం కల్వాల్ టైగర్ జోన్‌లోని గేట్ నంబర్-1, 2, ముందర ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూగర్భంలో కరిగిపోకుండా వర్షాకాలంలో నీరు ఇంక కుండా చేస్తాయన్నారు. దీంతో భూ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని చాలా మటుకు తగ్గించాలని సూచించారు. బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి ఐచర్ వ్యాన్ దగ్ధం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవునిగూడెం గ్రామ శివారులో ఉన్న కెనాల్ వద్ద ఓ ఐచర్ వ్యాన్ దగ్ధమైంది. మండలంలోని దుర్గం రవికి చెందిన ఐచర్ వ్యాన్ శనివారం గడ్డి లోడ్ చేసుకొని వెళ్తుండగా ప్రమాదవశాత్తు దేవునిగూడెం కెనాల్ వద్ద విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో మంటలు చెలరేగి వ్యాన్‌లో ఉన్న గడ్డితో సహా వ్యాన్ పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక, మండల అధికారి శ్రీనివాస్ సిబ్బంది సతీష్ అక్కడకు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. వ్యాను నడుపుతున్న దుర్గం రవికి స్వల్ప గాయాలయ్యాయి. రూ.12 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని దుర్గం రవి వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

కంటికి రెప్పలా కాపాడుతా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-తాండూర్

నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుతానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే కూతురు గడ్డం వర్ష ఆధ్వర్యంలో బెల్లంపల్లి 100 పడకల ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తూ ప్రజలకు సామాజిక సేవ చేస్తానని తెలిపారు. వైద్య విద్య రహదారులు మంచినీటి సౌకర్యాల రూపకల్పనకు ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో విద్య వైద్య రంగాల్లో సామాజిక సేవలందించేందుకు సొంత నిధులను ఖర్చు చేయడంతో పాటు ప్రభుత్వ యేతర సంస్థలను ప్రోత్సహిస్తానని తెలిపారు . కంటి వైద్య శిబిరంలో మొదట నెల మండలానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. దశలవారీగా నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజలకు ఉచిత కంటి వైద్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేతా శ్రీధర్, ఏసీపీ రవికుమార్, ఆర్డిఓ హరికృష్ణ , తహసీల్దార్ జోష్ణ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-కాసిపేట



మహిళలు కుట్టు శిక్షణలో నైపుణ్యం సాధించి స్వయం ఉపాధి పొందాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో జిల్లా వయోజన విద్య శాఖ, లయనక్లబ్ ఆఫ్ బెల్లంపల్లి స్త్రీ శక్తి లయన్స్ క్లబ్ ఆఫ్ దేవాపూర్ ఓరియంట్ గోల్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ, అక్షరాభ్యాస కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత, కుట్టు శిక్షణ కేంద్రం ద్వారా మహిళలు తాము కుట్టు శిక్షణలో తర్ఫీదు పొందుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు చదువు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. కుట్టు శిక్షణ నైపుణ్యం పొందిన మహిళలకు స్వయం ఉపాధి పొందే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. అక్షరాభ్యాస కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో రాష్ట్రంలోనే కాసిపేట మండలం ముందుంజలో ఉండడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అన్నారు. శిక్షణ పొందుతూ వయోజనులకు చదువు నేర్పించే మహిళలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 100 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కొంత మంది వయోజనులతో అక్షరాలు దిద్దించారు. అంతకు ముందు కుట్టుశిక్షణ కేంద్రంలో మహిళలకు కుట్టు మిషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దుర్గాప్రసాద్, ఓరియంట్ సిమెంట్ కంపెనీ జీఎం కులకర్ణి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీఓ సత్యనారాయణసింగ్ పాల్గొన్నారు.

టైగర్ జోన్ అడవుల్లో విద్యార్థుల విజ్ఞాన యాత్ర



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ టైగర్ జోన్ అడవిలో కరీంనగర్‌కు చెందిన ఐవీవై పాఠశాల విద్యార్థులు సిద్ధార్థ ఇనిస్ట్యూట్ విద్యార్థులు అడవిలోకి వెళ్లి అడవి అందాలను తిలకించారు. విద్యార్థులతో అటవీ అధికారులు కలిసి సఫారీలలో అడవి అందాలను తిలకించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హరిత రిసార్ట్ మేనేజర్ వీరేందర్ కుమార్, జన్నారం డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి, ఎఫ్‌బీఓ లాల్బాయ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అడవిలో ఉన్న జంతువులు, పక్షులు, ఇతర మూగజీవులపై అవగాహన కల్పించారు. అడవుల సంరక్షణ జంతు జీవరాసుల సంరక్షణపై వారికి వివరించారు. పాఠశాల విద్యార్థులు సిద్ధార్థ ఇనిస్ట్యూట్ విద్యార్థులు ఉపాధ్యాయులు అధ్యాపకులు అటవీ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-కాసిపేట

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ క్రైస్ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో నాబార్డు ఆధ్వర్యంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాజాత బృందం వారిచే బ్యాంకు ద్వారా అందించే పలు రకాల సేవల గురించి ఆటపాట రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ తెలంగాణ గ్రామీణ బ్యాంకు ద్వారా సామాజిక భద్రత పథకాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ఎస్బిఐ జనరల్ భీమా వంటి పలు రకాల ఇన్సూరెన్స్ సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అలాగే డిజిటల్ లావాదేవీలు, సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై గ్రామీణ ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సాయి కృష్ణ, ఏపీఎం వెంకటేష్, సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-మందమర్రి

ఎమ్మెల్యే వివేక్ ఆదేశాల మేరకు అతని నివాసంలో మండలంలోని పంచాయతీలు, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీలకి సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు చెక్కులు పంపిణీ చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ వివేక్ వెంకటస్వామి గెలిచినప్పటి నుండి మున్సిపాలిటీ వార్డులు కాలనీలలో సందర్శిస్తూ నిత్యం ప్రజల్లోనే ఉంటూ సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందిస్తున్నారన్నారు. అంతేకాకుండా అనేక నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పనులపైన ప్రత్యేక దృష్టి పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రణాళికతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కడారి జీవన్ కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ రఘునాథరెడ్డి, మండల అధ్యక్షుడు నీలయ్య, పట్టణ అధ్యక్షులు ఉపేందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, ఆఫీస్, మంకు రమేష్, ఆంజనేయులు, నంబయ్య పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చడమే లక్ష్యం

- ముల్కల్ల గోదావరి తీరంలో ఇసుక రీచ్ ఏర్పాటు
- ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని ముల్కల్ల గ్రామ శివారులో గోదావరి తీరంలో గనులు, భూగర్భ శాఖా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ప్రారంభించారు. అనంతరం ఇసుక వాహనంను జెండా ఊపి ఇసుక రవాణా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ కారణంగా గతంలో గోదావరి నుంచి ఇసుక రవాణకు నిత్యం ఆటంకాలు ఏర్పడేవని ఇప్పుడు ఇక ఇబ్బందులు ఉండవని ఈ క్రమంలో ఇసుక ట్రాక్టర్ యజమానులు అంతా సంయమనంతో ఇసుక రవాణా జరుపుకోవాలని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఇండ్ల నిర్మాణాల అవసరాలు తీర్చాకే ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా విషయంలో నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణ రంగమంతా కూడా సవ్యంగా సాగాలని, దళారుల ప్రమేయం లేకుండా ఇసుక పాలసీ నిబంధనలకు అనుగుణంగా కలెక్టర్ సహకారంతో ఇసుక రీచ్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఇసుక రీచ్ వ్యవహారం అంతా కూడా మైనింగ్ శాఖ ఆన్‌లైన్ ద్వారా చేపడుతుందని, ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు రీచ్ నిర్వహణ సాగాలన్నారు. ఇక ఆన్‌లైన్‌లో ఉండే డిపాజిట్ రుసుముతో ఇసుక రీచ్ నిర్వహణ, గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు. నాణ్యతతో కూడి ఇసుక తక్కువ ధరలో లభిస్తుండగా మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు చేరువలో ఉన్న ముల్కల్ల ఇసుక రీచ్ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఆర్డీఓ శ్రీనివాస్ రావు, మైనింగ్ ఏడీ జగన్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఘన సన్మానం



నవతెలంగాణ-మందమర్రి

క్రీడల్లో రాణించిన క్రీడాకారులను ఏరియా జీఎం దేవేందర్ ఘనంగా సన్మానించారు. శనివారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం దేవేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో ఒడిశాలోని సంబల్‌పూర్‌లో జరిగిన కోల్ ఇండియా బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో మందమర్రికి చెందిన వెంకటేశ్వర్లు వర్క్ షాప్ ఎలక్ట్రికల్ ఫోర్ మెన్ గోల్డ్ మెడల్, భాగ్యశ్రీ జూనియర్ అసిస్టెంట్ కాసిపేట-2 బ్రాంజ్ మెడల్, మనోహర్ జనరల్ మజ్దూర్ కాసిపేట-1 బ్రాంజ్ మెడల్ సాధించారు. ఆర్‌జీ-1, ఆర్జీ-2 లో కంపెనీ లెవెల్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో మందమర్రి, బెల్లంపల్లి టీంలు విజేతలుగా నిలిచారని తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెంలో జరిగిన కంపెనీ లెవెల్ కల్చరల్ ప్రోగ్రాంలో మందమర్రికి చెందిన ఆర్కెస్ట్రా టీం విజేతగా నిలిచి కోలిండియాకి సెలెక్ట్ కావడం జరిగిందన్నారు. గెలుపొందిన క్రీడాకారులందరినీ జీఎం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఇదే ఒరవడితో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ శివ, జనరల్ కెప్టెన్ శాఖ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాన చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-మంచిర్యాల



జిల్లా కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు శనివారం శంకుస్థాపన చేశారు. గోదావరి రోడ్‌లోని మెడికల్ కాలేజ్ ప్రాంగణంలో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రికీ శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల ప్రాంత ప్రజలకు ఉన్నతమైన వైద్యం అందించడానికి క్రిటికల్ కేర్ ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. 50 పడకల పడకల సామర్థ్యం గల ఆస్పత్రిలో ఎమర్జెన్సీ కేసులకు పరీక్షలు చేస్తారన్నారు. మంచిర్యాలను మెడికల్ హబ్‌గా మారుస్తానన్న హామీని ఖచ్చితంగా అమలు చేసి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరవుతారని పేర్కొన్నారు. రెండున్నరేళ్లల్లో ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రతి పక్షాల నోర్లు ముయిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

నర్సింగ్ కాలేజ్ పనులకు శ్రీకారం

జిల్లా కేంద్రంలోని సాయికుంటలో రూ.40.కోట్లతో నర్సింగ్ కాలేజ్ నిర్మాణం పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ప్రారంభించారు. మంచిర్యాల మెడికల్ కాలేజ్‌కు అనుబంధంగా నర్సింగ్ కాలేజ్ ఉంటుందని, ప్రస్తుతం మార్కెట్ యార్డులో మెడికల్ కాలేజ్ పక్కన నర్సింగ్ కాలేజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సొంత భవనం నిర్మాణంలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరామర్శ



జిల్లా కేంద్రంలోని సాయికుంటలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే . విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా విద్యార్థుల కోరిక మేరకు యాభై వేల విలువ గల వస్తువులు, ప్లేట్స్, గ్లాసులు, గిన్నెలు కొనుగోలు చేసి విరాళంగా అందజేశారు. గత 10 రోజుల క్రితం అస్వస్థతకు గురై చికిత్స అనంతరం హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో జిల్లా వైద్య అధికారి హరీష్ రాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.సులేమాన్, హాస్పిటల్ సూపరింటెండెంట్ హరీష్ చంద్ర రెడ్డి, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ సూరిమిల్ల వేణు, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు బానేష్, మాధంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

పరస్పర సహకారం నేర్పేది క్రీడామైదానమే



నవతెలంగాణ-లక్షెట్టిపేట

క్రీడమైదనంలో అన్ని మరిచి టీం గెలుపుకై పోరాడుతామని పరస్పర సహకారం నేర్పేది ఒక్క క్రీడ మైదానమే అని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమా కల్యాణి అన్నారు.. శనివారం కళాశాల మైదానంలో జూనియర్ బాలికల ఉమ్మడి అదిలాబాద్ జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ జట్టు ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కనపర్తి రమేష్ మాట్లాడుతూ నేటి ఎంపిక పోటీల్లో ప్రొడబుల్స్‌లో 20 మంది క్రీడాకారులను ఎంపిక చేసి వారికి ఈ నెల 19వ తేది నుంచి 28వ తేది వరకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల లో శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును 28వ తేదిన ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 29వ తేది నుంచి డిసెంబర్ 1వ తేది వరకు నిజామాబాద్ జిల్లా ఆలూరు మండలం, కల్లడి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ చాంపియన్షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ కె మహేశ్వరరావు, పాఠశాల పీఈటీలు మమత, రాజేష్, విశాల, దీపిక, కోచ్ అరవింద్‌తో పాటు సీనియర్ క్రీడాకారులు ప్రవీణ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఐఎన్టీయూసి చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాంశెట్టి నరేందర్

నవతెలంగాణ-మందమర్రి



ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాంశెట్టి నరేందర్ నియమితులయ్యారు. మందమర్రి ఏరియా కేకే-5 గనిలో అసిస్టెంట్ చైన్‌మెన్ గా నరేందర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకు రెండోసారి అవకాశం ఇచ్చిన ఐఎన్టీయూసి జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆశ్రమ బాలుర పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలోని ఆశ్రమ బాలుర పాఠశాలను జిల్లా కోఆపరేటివ్ అధికారి బి. సంజీవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో భోజన సదుపాయాలు, డైనింగ్ హాల్ నిర్వహణ, శానిటేషన్ నిర్వహణ, పిల్లలకు ఇచ్చే ప్రాథమిక ఆరోగ్య కిట్స్ గడువు తేదీ ముగిసిన విషయంలో, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి ఏఎన్ఎం సిబ్బందికి తగు సూచనలు చేశారు. అలాగే గ్రామపంచాయతీలలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గుల్లకోట గ్రామ పంచాయతిలో పర్యటించారు. ఎన్యుమరేటర్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌ని సర్వే వివరాలు అన్ని సక్రమంగా నమోదు చేస్తున్నారా ఆరా తీశారు. ఒక ఎన్యుమరేటర్ రోజు 20 కుటుంబాలు తప్పనిసరిగా సర్వే చేయాలని అన్నారు. గడుపు లోపు సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ కె.సరోజ, గుల్లకొట పంచాయతీ కార్యదర్శి సురేష్ ఉన్నారు.

నేరచరిత్ర గల వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వకండి

నవతెలంగాణ-వేమనపల్లి

నేరచరిత్ర గల వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోగల బుయ్యారం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి గ్రామంలో ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 33 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ధ్యేయమన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ప్రజలు అసాంఘిక శక్తులకు సహకరించవద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం, ఓటీపీ వివరా లను చెప్పవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ శామ్ పటేల్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు పెందుర్ దాదిరావ్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని ఝరి, లోకారి మినీ గురుకులం పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో మంచిగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల పేరు నిలబెట్టుకోవాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల చైర్మన్, మాజీ సర్పంచ్ మెస్రం దేవ్‌రావ్, విద్యార్థి సంఘ నాయకుడు పెందూర్ సంతోష్, పెందూర్ మధు, కొడప లింగు ఉన్నారు.

మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుని పరామర్శ

వాంకిడి : మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థి చౌదరి శైలజను మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురె శ్యామ్‌రావు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్‌కు కారకులైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని తెలిపారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే విద్యాశాఖ తన దగ్గర పెట్టుకొని విద్యార్థి జీవితాలను అంధకారంలో నెట్టివేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి విద్యార్థి చౌదరి శైలజకు మెరుగైన వైద్యం అందించాలని, లేనియెడల భవిష్యత్తులో జరిగే పరిణామాలకు అధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.



టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో విలేకరులకు సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో శనివారం విలేకరులను తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి పత్రిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ, గిరిజన సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ సామాజిక మార్పుకు ప్రేరణగా నిలిచిన విలేకరుల సేవలను తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్ కొనియాడారు. విలేకరులు పొదిల సుదర్శన్, జాడి మల్లేష్, ఆదిల్, వసంత్‌రావ్, జావేద్, రవీందర్ రాథోడ్, అజయ్‌ను శాలువాలతో సన్మానించి అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం ఉపేందర్, తెలంగాణ సామాజిక విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షులు జాడి వెంకటేష్ నేత, మాల సంఘం పట్టణ అధ్యక్షులు బొంకంటి సుభాష్, మైనారిటీ యువ నాయకుడు జుబేర్‌ఖాన్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇంటింటి కుటుంబ సర్వే తీరును ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్, ఎంఈఓ శివచరణ్ పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లకు కేటాయించిన బ్లాక్‌లలో గల అన్ని ఇండ్ల కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో కేటాయించిన అంశాల ప్రకారం స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియ పూర్తి చేసే విధంగా సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. వీరి వెంట పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో శనివారం సామాజిక, ఆర్థిక, కుల సర్వేను మండల స్పెషల్ అధికారి రవీందర్, ఎంపీడీవో రాజ్‌వీర్ పరిశీలించారు. ఎన్యుమరేటర్ సరిత సర్వే నిర్వహిస్తున్నారు.

సైన్స్ ల్యాబ్‌తో శాస్త్రీయ విద్య పెంపు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మొబైల్ సైన్స్ ల్యాబ్ ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ విద్య పెంపొందుతుందని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. కాగజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న మొబైల్ సైన్స్ ల్యాబ్ శ నివారంతో ముగిసింది. ఈ సందర్భంగా దానిని సందర్శించిన ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు గణితం, సైన్స్ సబ్జెక్టుల పట్ల ఆసక్తిని కలిగించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. విద్యార్థులలో తార్కిక ఆలోచనలను పెంపొందించేందుకు ఈ ప్రయోగశాల ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, రిసోర్స్ పర్సన్‌లు దుర్గం మోహన్, మహ్మద్ సాబీర్, మామిడాల తిరుపతయ్య, లక్ష్మిప్రసన్న, శాంతికుమార్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానానికి దాతలు ముందుకు రావాలి

నవతెలంగాణ-నార్నూర్

ఈ నెల 19న ఝరి పిహెచ్‌సిలో నిర్వహించే రక్తదాన శిబిరంలో దాతలు ముందుకు వచ్చి రక్తం దానం చేయాలని దాబా గ్రామ యూత్ సభ్యులు మెస్రం గోవింద్ అన్నారు. గ్రామ శ్రీసంత్ దేవభారతి యూత్ సభ్యులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. అవగాహన సదస్సులో ఆదివాసీ నాయకులు పెందోర్ సంతోష్, కుంరం జగన్, గజానంద్, పరశురాం, మాణిక్, బాపురావ్, జలపతి, మారుతీ పాల్గొన్నారు.

24న స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ జిల్లా ఎన్నికలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సూచనల మేరకు ఈ నెల 24న జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు అసోషియేషన్ జిల్లా కార్యదర్శి ఎం దేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ ఎన్నికలకు రాష్ట్ర కమిటీ నుండి పరిశీలకులు హాజరు అవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ అధ్యక్షుడిగా ఉన్న ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ కృషి వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరాటే క్రీడకు గుర్తింపు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహ విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. శనివారం ఆయన కాగజ్‌నగర్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులు, ఆవరణతో పాటు కిచెన్‌లోకి వెళ్లి అక్కడి పరిసరాలు, వంటలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన చర్యలు తీసకుంటూ ఉండాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. వంటలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులను వాడాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఉండాలని అన్నారు. తమ పాఠశాలలో లెక్కల సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల విద్యాధికారి ప్రభాకర్‌ను ఆదేశించారు.



కస్తూర్బాలో కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



కులగణన సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

కులగణన సర్వే పరిశీలన

కాగజ్‌నగర్ పట్టణంలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వేను శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పరిశీలించారు. స్థానిక ఈద్గా కాలనీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకండా సర్వే చేపట్టాలని ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు సూచించారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి కావాలని మున్సిపల్ కమీషనర్ అంజయ్యను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో పాటు తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మారుమూల గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని ధన్నోర(బి) గ్రామంలో వారం రోజుల పాటు కొనసాగిన ఆ ఖండ హరినామ సాప్తహ ముగింపు రోజున జరిగిన కాళ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందు విఠల్ రుక్మిణి దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాటగూడ గ్రామంలో ఇటీవల మరణించిన గేడం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రధానంగా నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ జేఈతో ఫోన్‌లో మాట్లాడి ఎండాకాలం రాకముందే గ్రామస్తులకు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఏకలవ్య పాఠశాలలో సైతం నీటిని అందించాలన్నారు. భారతదేశం భిన్న సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని అన్నారు. తరతరాలుగా ఆచరిస్తూ, వస్తున్న సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈనెల 17, 18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. 17న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయని, ఆ మరుసటి రోజైన 18న ఉదయం సెషన్‌లో పరీక్ష ఉంటుందని వివరించారు. జిల్లాలో మొత్తం 8,124 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాయని అన్నారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా కేంద్రాలలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు అనుక్షణం నిశిత పర్యవేక్షణ జరుపుతామని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. టీజీఎస్ ఆర్టీసీ ద్వారా ఆయా రూట్లలో పరీక్ష సమయానికి చేరుకునే విధంగా బస్సులను నడపడం జరుగుతుందని తెలిపారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రంలోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందని, అనంతరం గేట్లు మూసివేస్తారని, మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 తరువాత ఎవరినీ లోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదని, ఈ మేరకు ప్రతి కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని ఆదేశించామన్నారు. పరీక్షా సమయం ప్రారంభం నుంచి ముగిసేంత వరకు పరీక్ష కేంద్రం నుంచి



అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు కూడా బయటకు వెళ్లకూడదని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, సజావుగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు.

ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేయడం సరికాదు

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నవతెలంగాణ-ముధోల్

ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపితే అరెస్ట్ చేయించడం సరికాదని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ట్రిపుల్ ఐటీ ముట్టడికి ఏబీవీపీ పిలుపునివ్వడంతో శనివారం పోలీసులు ఉదయం నుంచి ఎక్కడికెక్కడ కార్యకర్తలను అరెస్టు చేశారు. హైదరాబాద్, నిజామాబాద్, పలు ప్రాంతాల నుంచి ఏబీవీపీ కార్యకర్తల రాగా, బాసరలో వారిని అరెస్టు చేసి, ముధోల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం లో ఉన్నప్పటికి శనివారం సాయంత్రం ముధోల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఏబీవీపీ కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం ఏఎస్పీ అవినాష్ కుమార్‌తో మాట్లాడి వారిని విడిపించారు. బాసర రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయించి, ఏబీవీపీ కార్యకర్తలను వారి స్వగ్రామాలకు పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడారు. ప్రజాస్వామ్యం బద్ధంగా నిరసనలు తెలుపుతుంటే అరెస్టులు చేయడం సమంజసం కాదన్నారు. ట్రిపుల్ ఐటీలో సమస్యల రాజ్యమేలుతుంటే, పట్టించుకోవాల్సింది పోయి, ఆందోళన చేస్తున్న వారిని అదుపులో తీసుకోవడం తగదన్నారు. ఇకనైనా ట్రిపుల్ ఐటీలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏబీవీపీ కార్యకర్తలకు బీజేపీ ఎల్లవేళలా అండగా ఉంటుదని అన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు తాటివార్ రమేష్, శ్రీనివాస్, జీవన్, పోతన్న పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ వేరువేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సంబంధిత ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రిపోర్టులను వెంట వెంటనే తమకు అందజేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ప్యాడి క్లీనర్ల ద్వారా తమ ధాన్యాన్ని శుభ్రం చేసి అమ్మే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి వరి కొనుగోలు కేంద్రంలో సరిపడ గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడి క్లీనింగ్, తూకపు, తేమ యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం రైస్ మిల్లర్లతో మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని ఆదేశించారు. ప్రతి రైస్ మిల్లరు ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. తరుగు పేరుతో రైతుల నుంచి అధిక ధాన్యాన్ని సేకరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, డీసీఓ రాజమల్లు, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన డీసీసీ



నవతెలంగాణ-కడెం

నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యాటక బోటులో ప్రాజెక్టులో బోటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు తుమ్మల మల్లేష్, మాజీ ఎంపీపీ అంటోని అలెగ్జాండర్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ముస్కు రాజు, అడ్వకేట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహిళల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఖానాపూర్ వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఇరవై మంది బీసీ లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నేరవేరుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లతో పాటు రైతుబంధు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ప్రవీణ్, ఎంపీడీఓ కే.భాస్కర్, ఆర్ఐ.లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు ముఖాడే ఉత్తం, శ్రీకాంత్, సొమురే నాగోరావ్, జవాడే కేశవ్, మాజీ సర్పంచ్ సంకట్‌రావ్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో దొంగతనం

- రూ.10వేలు చోరీ..



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ముక్కెర రాజేశ్వర్‌గౌడ్ ఇంట్లో దొంగతనం జరిగింది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్థరాత్రి రాజేశ్వర్‌గౌడ్ తన ఇంటి పై పోర్షన్ గదికి తాళం వేసి పడుకోగా, గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి ఇంట్లోకి చొరబడి పర్సులో ఉన్న రూ.10వేల నగదుతో పాటు తన కుమారుడికి సంబంధించిన ఇతర కార్డులను దొంగిలించారు. అదేవిధంగా అదే కాలనీకి చెందిన మరో రెండు ఇండ్లలో దొంగతనానికి ప్రయత్నించారు. కానీ వారి ఇండ్లలో ఎటువంటి విలువైన వస్తువులు గాని నగదు గాని దొంగిలించలేదని, ఈ విషయమై బాధితుడు రాజేశ్వర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖానాపూర్ ఎస్సై జి.రాహుల్ గైక్వాడ్ నేర స్థలాన్ని సందర్శించి, క్లూస్ టీం వారిని పిలిపించి, పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చిలుకగోరి గుట్టను తవ్వడం సరికాదు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని పలువురు నాయకులు గుట్టలను తవ్వి మొరం తరలించడం సరికాదని, సీపీఐ జిల్లా ప్రదాన కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు నాయకులు వారి రాజకీయ పలుకుబడితో మండలంలోని దిలావర్‌పూర్ శివారులోని చిలుక గోరి గుట్ట వద్దనుంచి మొరం తరలించుకుపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చిలుక గోరి గుట్టను తవ్వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.